# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం | 14 ఆగస్టు 2024 | పేజీలు 8


## విద్యార్థుల కుటుంబానికి రూ. 5 లక్షలు..

# ఒకరికి ఉద్యోగం ఇస్తాం



హైదరాబాద్ పెన్ పవర్:జగిత్యాల జిల్లా పెద్దాపుర్ గురుకుల పాఠశాలలో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. గురుకుల పాఠశాలను పరిశీలించిన భట్టి, మంత్రి పొన్నం.. చనిపోయిన విద్యార్థుల

-5 లో

రూ.8 లక్షలతో పట్టుబడిన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్..



# ఏసీబీ వలలో...
# రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్




### రూ. 8 లక్షలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కిన జేసి..

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి సోమవారం రాత్రి 11 గం. ఏసీబీకి చిక్కారు..
- బాధితుడు జక్కిడి ముత్యంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో జాయింట్ కలెక్టర్‌ను ట్రాప్ చేసిన ఏసిబి..
- ధరణి వెబ్‌సైట్‌లో నిషేదిత జాబితా నుండి 14 గుంటల భూమిని తొలగించేందుకు డీల్..
- పని చేసి పెట్టేందుకు ఎనిమిది లక్షలు డిమాండ్ చేసిన సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్ రెడ్డి..
- బాధితుడి కారులో డబ్బులు తీసుకుంటుండగా ఉన్నపళంగా పట్టుకున్న ఏసీబీ..
- ఏసీబీ కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరినీ 14 రోజుల రిమాండ్‌కు తరలింపు..

ధరణీ తెచ్చిన తంటా.. అదనపు కలెక్టర్‌ను కటకటాల పాలు చేసింది.. దొరికితేనే దొంగ.. లేకపోతే దొర.. అన్న చందంగా తయారైంది రెవెన్యూ అధికారుల తీరు.. అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కితేకానీ వాళ్ళ నిజ స్వరూపం బయట పడటం లేదు.. ఉన్నతమైన విధుల్లో ఉన్న అధికారులు నెలనెలా లక్షల్లో జీతాలు తీసుకుంటూనే.. అవినీతికి పాల్పడిన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డిని అరెస్ట్ చేదిన ఏసిబి అధికారులు..!ఏసీబీ కోర్టు ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించారు.. చట్టంలోని లొసుగులను అడ్డుపెట్టుకుని, నిషేధిత జాబితా నుండి తొలగించేందుకు బేరం కుదుర్చుకుని లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఉన్నపళంగా పట్టుకున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్,ఆగష్టు 13:

-2లో



## గ్రేటర్‌లో హడలెత్తిస్తున్న..
# ఆపరేషన్ 'హైడ్రా'..



ఎమ్మెల్యే దానం నాగేందర్..



హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఐపీఎస్..

- జీహెచ్ఎంసి పరిధిలోని చెరువులు పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఐపీఎస్..
- ఉప్పల్ నల్ల చెరువులో కబ్జాలపై సోమవారం వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ విజిట్..
- ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న, పరమేశ్వర్ రెడ్డితో కలిసి నల్లచెరువు పరిశీలించిన రంగనాథ్..

-4 లో

## నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. ఉచిత వైద్య శిబిరం..!

వైద్యశిబిరాన్ని ప్రారంభించిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే.పి.వివేకానంద..

-3లో

## మహిళల భద్రత కోసం 5 రోజులు స్పెషల్ డ్రైవ్



హైదరాబాద్ పెన్ పవర్:మహిళల భద్రత కోసం ఐదురోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టబోతున్నామన్నారు మంత్రి సీతక్క. సెక్రటేరియేట్ లో స్త్రీశిశు సంక్షేమశాఖపై రివ్యూ నిర్వహించారు. స్వల్పకాలిక ప్రణాళికలతోపాటు..దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు ఓపెన్ గా మాట్లాడే ధైర్యం కల్పిస్తామని చెప్పారు. సమాజం ఆలోచన మారేవిధంగా తమ ప్రణాళికలు ఉంటాయన్నారు సీతక్క. ప్రజల్లో మార్పు తెచ్చేలా ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించాలని ఆదేశించారు.

-5 లో

# ఏసీబీ వలలో.. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్..

## బాధితుని ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ..

బాధితుడు జక్కిడి ముత్యంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు జాయింట్ కలెక్టర్‌ను ట్రాప్ చేసినట్లు సమాచారం.. ధరణి వెబ్‌సైట్‌లో ప్రొహిబిటెడ్ లిస్ట్ నుండి 14 గుంటల భూమిని తొలగించాలని బాధితుడు కోరినట్లు అధికారులు పేర్కొన్నారు.. అయితే ఈ వ్యవహారంలో పని ముగించేందుకు సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్ రెడ్డి
రూ.8 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిపారు.. బాధితుడి కారులో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారని అన్నారు.. జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి చెబితేనే తాను డబ్బులు తీసుకున్నట్లు సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ ఏసీబీ ముందు ఒప్పుకున్నారని వెల్లడించారు.. వెంటనే ఏసీబీ అధికారుల ముందే జాయింట్ కలెక్టర్‌కి సీనియర్ అసిస్టెంట్ ఫోన్ చేసి డబ్బుల వివరాలను తెలియజేయగా.. పెద్ద అంబర్పేట్ ఔటర్ రింగ్ రోడ్డు వద్దకు డబ్బులు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ ఫోన్‌లో చెప్పినట్లుగా ఏసీబీ పెర్కొంది..

## భూపాల్ రెడ్డి ఇంట్లోనూ సోదాలు.. భారీగా నగదు, డాక్యుమెంట్‌లు..

పెద్దంబర్పేట్ వద్ద జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డికి సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్ డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఉన్నపళంగా పట్టుకున్నారు.. ఇద్దరినీ అరెస్ట్ చేసిన అధికారులు ఏసీబీ కోర్టు ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలింపు.. భూపాల్ రెడ్డితో పాటు మదన్మోహన్ మరో అధికారిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.. కాగా భూపాల్ రెడ్డి పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న భూపాల్ రెడ్డి ఇంట్లో సైతం సోమవారం రాత్రి నుంచి సోదాలు నిర్వహిస్తున్నారు.. కుటుంబ సభ్యులను బయటకు వెళ్లకుండా విచారణ చేపట్టినట్లు సమాచారం. పెద్ద మొత్తంలో నగదుతో పాటు పత్రాలు లభిస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం.. ఈ దాడుల్లో ఏసీబీ సిటీ రేంజ్ 1 డిఎస్పి శ్రీనివాస రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు జానకిరామ్ రెడ్డి, నరేష్ ఇతర బృందం ఈ దాడులు పాల్గొన్నట్లు సమాచారం పూర్తి వివరాలను తొందరలో మీడియాకు వివరిస్తామని ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం వెల్లడించారు..

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో గత పదేళ్ళుగా అధికారులకు పూర్తి స్వేచ్ఛను కలిపించారు..కబ్జాలపై పత్రికల్లో వార్తలు వచ్చినా పట్టించుకోవాల్సిన అవసరం లేదని, అప్పట్లో పైనుండి ఉత్తర్వులు కూడా ఉండేవట.. ఇప్పటికీ కొన్నిచోట్ల అదే కొనసాగుతుండటం గమనార్హం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో లేని అవకాశాలు..! తెలంగాణ రాష్ట్ర సాధనతో అధికారులకు కల్పించారని సర్వత్రా విమర్శనలు ఎన్నో..! ఆ స్వేచ్ఛే ఇప్పుడు ఒక్కొక్కరిని ఏసిబి అధికారులకు పట్టిస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి సోమవారం రాత్రి ఏసీబీ అధికారులకు చిక్కారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి నుంచి 8 లక్షల లంచం తీసుకుంటుండగా ఓఆర్ఆర్ పరిధిలో ఏసీబీ అధికారులకు చిక్కారు.. ధరణిలో పనులు చేసేందుకు మధ్యవర్తులతో ఒప్పందం కుదుర్చుకున్నారు.. అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి ఒప్పందం ప్రకారం ఎనిమిది లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.. సోమవారం రాత్రి నుంచి కార్యాలయం లోనే భూపాల్ రెడ్డి విచారించారు..

## సియోల్‌లో చుంగ్ గేచంగ్ నదిని సందర్శించిన సీఎం రేవంత్



హైదరాబాద్ పెన్ పవర్:దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరంలోని చుంగ్ గేచంగ్ నదీ పరిసరాలను పరిశీలించారు సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి శ్రీధర్ బాబు బృందం. హైదరాబాద్ మూసీ రివర్ ఫ్రంట్ ను అభివృద్ధిపై ఫోకస్ పెట్టిన సీఎం.. ఇందులో భాగంగా చుంగ్ గేచంగ్ నదీ వివరాలు తెలుసుకున్నారు.చుంగ్ గేచంగ్ నదీ ... మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కు అనేక ఆలోచనలను కలిగించిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. గతంలో ఈ నది 11 కిలోమీటర్ల వరకు విపరీతమైన కలుషితాలతో ఉండేది. 2005 నాటి నుంచి పునరుద్దరణ పనులతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రివర్ ఫ్రంట్ గా తీర్చిదిద్దారు. సియోల్ నగరవాసులతో పాటు ప్రపంచం నలుమూలల నుంచి ఏటా 19 కోట్ల మంది పర్యాటకులు సందర్శిస్తున్నారు.

# టోల్ ఛార్జీలా మజాకా.. ప్రతి నెలా రూ.5వేల కోట్లు వసూలు




హైదరాబాద్ పెన్ పవర్:టోల్ ఛార్జీల మజాకా..గత ఏడాది టోల్ ఛార్జీలు చూస్తే..దిమ్మెర పోవాల్సిందే..సరాసరి నెలకు 5వేల కోట్ల టోల్ వసూలు అవుతోంది. ఫాస్టాగ్ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో నెలకు రూ. 5వేల కోట్లు వసూలు అయ్యాయని రోడ్డు రవాణా, రహదారులు మంత్రిత్వ శాఖ యాన్యువల్ రిపోర్ట్ లో తెలిపింది. రోడ్డు రవాణా రహదారులు మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం టోల్ వసూళ్లు రూ. 64వేల కోట్లకు పైగా వచ్చాయి. 2024 మార్చి నెలలో అత్యధికంగా 5వేల 911 కోట్లు వసూలు అయ్యాయి. అత్యల్పంగా జూలై 2023లో 4వేల 966 కోట్లు వసూలు చేసినట్లు తెలిపింది. 2022 డిసెంబర్ లో అత్యధికంగా 4వేల 918 కోట్లు వసూలు కాగా.. అంతకుముందు 2021 డిసెంబర్ లో రూ. 3వేల 674 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి.

మార్చి31, 2024 నాటికి 8.81 కోట్లు ఫాస్టాగ్?లను జారీ చేశారు. %జుజ% ద్వారా రోజువారీ సగటు వసూళ్లు మొత్తం 98.5 శాతం పెరిగి రూ.190.67 కోట్లకు చేరాయి. మొత్తం 1365 జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఆగస్టు జూలై 2023 నాటికి 98 శాతం నుంచి 99 శాతం టోల్ వసూలు మెరుగుపడింది.

జాతీయ రహదారులపై టోల్ వసూళ్లలో స్థిరమైన పెరుగుదల ఉంది. దీనికి కారణం టోల్ సేకరణ ఎలక్ట్రానిక్ ఫాస్టాగ్ కి మారడమే మంత్రిత్వ శాఖ చెపుతోంది. ట్రాఫిక్ పెరగడం, టోల్ ఫీ రేట్లలో మార్పులు, కొత్త టోల్ రహదారుల పొడవును పెంచడం వంటివి టోల్ సేకరణ పెరుగుదలకు ఇతర కారణాలని చెప్పింది. 2015 నుంచి 2023 మధ్య కాలంలో దేశం అంతగా టోల్ వసూలు మూడు రెట్లు పెరిగింది. 2015లో రూ. 17వేల 759 కోట్లుండగా.. 2023లో 48వేల 028 కోట్లకు పెరిగింది.

ఫాస్టాగ్ ట్రాఫిక్ అతుకులు లేకుండా ఉండేలా వాహనదారులనుంచి వసూళ్లలో పారదర్శకత పెంచడం కోసం నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణ, రహదారులు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో 40 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు కలిసి పనిచేస్తున్నాయి.. ప్లాజా లావాదేవీల ప్రాసెస్ చేయడానికి 14 అక్వైరర్ బ్యాంకులు పనిచేస్తున్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

- సీనియర్ జర్నలిస్ట్ గోగులపాటి కృష్ణమోహన్ పుట్టిన రోజు సందర్భంగా వైద్య శిబిరం..
- సామాన్యులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో ఈ శిబిరం దోహదపడుతుంది..
- ఉచిత మందులు అందజేసిన ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద..
- గోగులపాటికి చెందిన డిజిటల్ మీడియా ఛానల్ లోగో ఆవిష్కరించిన ఎమ్మెల్యే..
- లోగో ఆవిష్కరణలో సీనియర్ జర్నలిస్టులు సుధీర్ మంకాలా, సర్వేపల్లి రమేష్..

నా టీవీ లోగో ఆవిష్కరణలో ఎమ్మెల్యే వివేకానంద, సుధీర్ మంకాల, గోగులపాటి,సర్వేపల్లి రమేష్..




# నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

# ఉచిత వైద్య శిబిరం..!

## వైద్యశిబిరాన్ని ప్రారంభించిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద..

### జర్నలిజంలో గోగులపాటి అనుభవ శాలి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోగులపాటి కృష్ణమోహన్ స్థాపించిన నా ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు మరిన్ని సేవలు అందాలని ఆకాంక్షించారు. జర్నలిజంలో మూడు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న గోగులపాటి కృష్ణమోహన్ నేతృత్వంలో స్థాపించిన నాటీవీ ద్వారా ప్రజలకు మెరుగైన సమాచారం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ నాటీవికి శుభాకాంక్షలు తెలియజేశారు.. కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సుధీర్ మంకాల మాట్లాడుతూ నా టీవి సమాజానికి మెరుగైన సమాచారం అందిస్తుందని, ఆదరాభిమానాలు చూరగొంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు..



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 13:** సామాన్యులకు కార్పోరేట్ వైద్యసేవలు అందించడంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కేపీ వివేకానంద అన్నారు.. నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ జన్మదినం పురస్కరించుకొని, సూరారం కాలనీలోని శ్రీ కళ్యాణ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో, నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సియంఆర్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద ముఖ్య అతిధిగా హాజరయ్యారు.. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి వివేకానంద ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్య సేవలు పొందిన వారికి ఉచిత మందులు అందజేశారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు గోగులపాటి కృష్ణమోహన్ స్థాపించిన నా టీవి డిజిటల్ చానల్ లోగోను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు..

### సాహిత్య వికాసం..సామాజిక శ్రేయస్సు..

ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు నా ఫౌండేషన్ మరియు నా టీవీ వ్యవస్థాపకులు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ సాహిత్యస్య వికాసాయ, రక్షణాయ చ సంస్కృతేః సామాజిక హితార్థాయ, నా సంస్థా వర్తతే చిరంః అనే శ్లోకం ఆధారంగా సాహిత్య వికాసం సామాజిక శ్రేయస్సు, సాంస్కృతిక పరిరక్షణ ధ్యేయంగా నా ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇక మీడియా రంగంలో తనకున్న పాతికేళ్ల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని సమస్యకు పరిష్కారానికి వారధిగా ఉండాలనే సత్ సంకల్పంతో డిజిటల్ మీడియా వేదికగా నా టీవీని ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఇక వైద్య ఆరోగ్య శిబిరం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి గల ప్రధాన కారణం దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా సేవా కేంద్రాలుగా కూడా ప్రజల్లోకి వెళ్లాలనే సంకల్పంతో రామాలయంలో ఈ వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాంచంద్రారెడ్డి, నందగోపాల్, వెంకటేష్, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన సలహాదారుడు రమేష్ సర్వేపల్లి గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సుబ్రమణ్య స్వామి హరి రాఘవేంద్ర శ్రీధరాచార్యులు సురేష్ శర్మ, హనుమంతరాయ శర్మతో పాటు సియంఆర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రియాజ్, డాక్టర్ సుమ కోఆర్డినేటర్ రాజ్ నారాయణ్ ప్రభృతులు పాల్గొన్నారు..



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే..



## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి ...చైర్మన్ చంద్రారెడ్డి

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 13:** నాగారం



మున్సిపాలిటీలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ చంద్రారెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ, ప్రతి ఒక్కరిలో జాతీయ భావం, ఐక్యం పెంపొందాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా

ఇంటింటికి మువ్వన్నెల పతాకాన్ని అందజేశారు. చిన్న పిల్లల చేత వాళ్ళ వాళ్ళ ఇంటిదగ్గర జెండాలను ఎగరవేయించారు. ప్రతి ఒక్కరు ఇళ్ల వద్ద మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసి మన జాతీయతను చాటి చెప్పాలని చైర్మన్ చంద్రారెడ్డి కోరారు.

## శుభకార్యాలు వేడుకలలో... హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు.





**కుషాయిగూడ ఇన్స్పెక్టర్ అంజయ్య**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 13:** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలనీలు బస్తీలలో జరిగే శుభకార్యాలు గృహప్రవేశాలు వేడుకలు హోటల్లు మాల్స్ ప్రారంభోత్సవాలలో హిజ్రాలు వేలకు వేలు డిమాండ్ చేస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కుషాయి గూడ ఇన్స్పెక్టర్ అంజయ్య హిజ్రాలను హెచ్చరించారు. మంగళవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్లో సీఐ అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హిజ్రాలు వాళ్ల గురువులు చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధులు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిజ్రాలు వాళ్ల గురువులకు కౌన్సిలింగ్ నిర్వహించి కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో భవిష్యత్తులో చిన్నపాటి శుభకార్యమైన పెద్దదైన వారు నిర్వాహకులు ఇష్టం తోటి ఇచ్చిందే తీసుకోవాలి కానీ ఇళ్లలోని మహిళలను పిల్లలను బంధువులను భయభ్రాంతులకు గురిచేసేలా బూతులు తిడుతూ బట్టలు విప్పి వెకిలి చేష్టలతో అక్రమ వసూళ్లకు పాల్పడడం ఆపేయాలని సిఐ అంజయ్య హిజ్రాలకు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి ఎస్ ఏ రహీం కొండూరి మురళి పంతులు పురుషోత్తం రెడ్డి షాబాద్ దామోదర్ రెడ్డి డాక్టర్ కుమారస్వామి చిన్న దుర్గారెడ్డి రాజు నవీన్ విజయ సుజాత శ్రీనివాస్ శివ తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్‌లో హడలెత్తిస్తున్న.. ఆపరేషన్ 'హైడ్రా'..

- **జీహెచ్ఎంసి పరిధిలోని చెరువులు పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఐపీఎస్..**
- **ఉప్పల్ నల్ల చెరువులో కబ్జాలపై సోమవారం వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ విజిట్..**
- **ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న, పరమేశ్వర్ రెడ్డితో కలిసి నల్లచెరువు పరిశీలించిన రంగనాథ్..**



ఎమ్మెల్యే దానం నాగేందర్..



హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఐపీఎస్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 13:**

గ్రేటర్‌లో ఆపరేషన్ హైడ్రా కొనసాగుతోంది. మంగళవా రం జీహెచ్ఎంసి పరిధిలోని చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నల్లచెరువులో కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు. చెరువు పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు..

ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఉప్పల్ నల్ల చెరువులో జరుగుతున్న కబ్జాలపై వివరించిన విషయం తెలిసిందే.. దీంతో రంగనాథ్ మంగళవారం ఉప్పల్లోని చెరువులను ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న, పరమేశ్వర్ రెడ్డి, వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డితో కలిసి నల్లచెరువును పరిశీలించారు. నల్ల చెరువులో కబ్జాలను, ఆక్రమణలు పూర్తిగా తొలగించడంతో పాటు చెరువు పరిరక్షణ కోసం హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. చెరువులను, నాలాలను, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కబ్జాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు..

**హైడ్రా కమిషనర్‌పై.. ఎమ్మెల్యే దానం ఆగ్రహం..**

మరోవైపు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ హుడా లేఔట్ ఘటన నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే దానం మీడియాతో మాట్లాడుతూ.. రంగనాథ్‌కు అప్పగించిన పదవి ఇష్టం లేనట్టుందన్నారు.. అందుకే తనపై కేసు పెట్టారని దానం తీవ్రంగా వ్యాఖ్యానించారు. అధికారులు వస్తుంటారు పోతుంటారు.. కానీ తాను మాత్రం లోకల్ అని సినీ డైలాగ్‌తో పేర్కొన్నారు. నందగిరి హిల్స్ హుడా లేఔట్ విషయంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ వ్యవహారంలో అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇస్తానని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని వార్నింగ్ ఇచ్చారు.. అంతేకాదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

**నాపై మస్తు కేసులు ఉన్నయ్.. భయపడేదే లేదు..**

హైడ్రా అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ గురుబ్రహ్మ నగర్‌లో పేదల గుడిసెలు కూల్చివేసే అధికారం వారికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. పార్క్ స్థలం అని చెప్పి ఈవీడీఎం వాళ్లు పెద్ద ప్రహరీ గోడ కడుతున్నారని.. బస్తీ వాసులకు దారి లేకుండా ప్రహరీ గోడ ఎలా కడతారని ప్రశ్నించారు..? గోడ కట్టొద్దు అన్నందుకే ఈవీడీఎం అధికారులు తనపై కేసు పెట్టారని దానం తెలిపారు. హైదరాబాద్‌ను హైడ్రా అధికారులకేమీ రాసివ్వలేదని.. ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తనపై 190 కేసులు ఉన్నాయని.. కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు.

# సీతారామ ప్రాజెక్ట్ ఘనత

# కాంగ్రెస్, బీఆర్ఎస్ క్రెడిట్ వార్ షురూ !

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ ఖమ్మం, ఆగస్టు 13:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ప్రారంభానికి సిద్ధమయింది. ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ పంప్ హౌస్ నిర్మాణం పూర్తి కావడంతో ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిని ప్రారంభించనున్నారు. తర్వాత రేవంత్ రెడ్డి బహిరంగసభలో ప్రసంగించనున్నారు. 2026 ఆగస్టు నాటికి సీతారామ ప్రాజెక్టు కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ చెబుతోంది. బిఆర్ఎస్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన సీతారామ ప్రాజెక్టు ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో పూర్తయ్యే దశకు చేరుకుందని మంత్రులు ప్రకటించారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ద్వారా పూర్తి ఆమోదం పొందామని.. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు గోదావరి నది నుండి 67 టిఎంసిల నీరు అందుతుందని స్పష్టం చేస్తున్నరు. బీఆర్ఎస్ పాలనలో అసమర్థత, వృథా ఖర్చులు ఉన్నాయని, రీడిజైనింగ్ ముసుగులో ప్రాజెక్టు వ్యయాన్ని రూ.2,400 కోట్ల నుంచి రూ.18,000 కోట్లకు పెంచారని అంటున్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేస్తోందన్నారు.సీతారామ ప్రాజెక్టు బీఆర్ఎస్ కష్టానికి ప్రతిఫలమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కేసీఆర్ సాధించిన విజయాలను మీవిగా చెప్పుకోవడానికి తాపత్రయం పడుతున్నారని మండిపడ్డారు. ఎనిమిది నెలల కాలంలో ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం మేం కృషి చేస్తుంటే ఇదే కాంగ్రెస్ నాయకులు కోర్టుల్లో కేసులు వేశారు... అప్పుడు బీఆర్ఎస్‌లో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్ రావు మాట మార్చారున్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం బీఆర్ఎస్ పార్టీ ఘనత కాదని తుమ్మలను గుండెల మీద చేయి వేసుకోని చెప్పాలని సవాల్ చేశారు. కేసీఆర్ లేకుండా ఉంటే అంత గొప్పగా సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగేది కాదని సీతారామ కేసీఆర్ కల.. ఇది ఆయన కృషి ఫలితం అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో 90 శాతం ప్రాజెక్టు పూర్తయిందని హరీష్ రావు లెక్కలు చూపించారు. పంపులు, మోటార్లు కూడా అప్పుడే పెట్టాం. సబ్ స్టేషన్ల నిర్మాణం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే జరిగింది. ఇది అందరికీ తెలుసు. ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లు ప్రజలను నమ్మించడం

పొరపాటన్నారు. మీ పరిపాలనలో నిర్మించినప్పుడు మీ ఘనతగా చెప్పుకుంటే మాకు అభ్యంతరం లేదు. ఇతరుల ఘనతను తమ ఘనతగా చెప్పుకునే దరిద్రం నుంచి బయటకు రావాలని హరీశ్‌రావు సలహా ఇచ్చారు. మొత్తంగా పదిహేనో తేదీన రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న సీతారామ ప్రాజెక్టు మరింత రాజకీయ దుమారం రేగడం ఖాయంగా కనిపిస్తోంది.



# దసరా తర్వాత  మహిళలకు గుడ్ న్యూస్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ వరంగల్, ఆగస్టు 13:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పీడ్ మీదున్నారు. ఆయన వరసగా ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే పనిలో ఉన్నారు. ఆరు గ్యారంటీలతోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వరసగా వాటిని అమలు చేస్తూ వెళుతుంది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేశారు. ఐదు వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ ను అందచేస్తున్నారు. గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి రెండు వందల యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తును అమలు చేస్తున్నారు. అయితే తెల్ల రేషన్ కార్డులు ఉన్నవారికే ఈ పథకాన్ని అందచేస్తున్నారు. తాజాగా రైతు రుణమాఫీని రెండు లక్షల రూపాయల వరకూ మాఫీ చేసి అమలు చేశారు. ఆగస్టు 15వ తేదీతో రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తారు.. ఇప్పటికే అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటి పోతుండటంతో రేవంత్ రెడ్డి మిగిలిన హామీల్లో ఒక్కొక్కదానిని అమలు చేయాలని నిర్ణయించారని తెలిసింది. అందులో ముఖ్యమైనది మహిళలకు ప్రతి నెల రెండు వేల రూపాయల సాయం ప్రకటిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద ఇది ఒక్కటే మిగిలి ఉంది. ఇందుకు అర్హులైన మహిళల జాబితాలను సిద్ధం చేయాలని ఇప్పటికే రేవంత్ రెడ్డి ఆదేశాలను జారీ చేసినట్లు తెలిసింది. ఈ మేరకు అధికారులు ఎంత మంది మహిళలకు నెలకు రెండు వేల రూపాయలు ఇవ్వాలి? ఖజానా పై ఎంత భారం పడుతుందన్న లెక్కలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. రేషన్ కార్డుల జారీ తర్వాత... మరోవైపు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమవుతుంది. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తులు చేస్తుంది. అది పూర్తయిన వెంటనే తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో మహిళలందరికీ నెలకు రెండు వేల రూపాయలు ఇచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారట. అయితే ఇది వరకే వేరే రకమైన పింఛను తీసుకుంటున్న వారికి ఈస్కీమ్ వర్తించదు. ఎటువంటి పింఛను తీసుకోకుండా తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళలకు నెలకు రెండు వేల రూపాయలు ఇచ్చే పథకానికి ప్రియాంక గాంధీ చేత చేయించాలని డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. నిజంగా ఇది మహిళలకు శుభవార్తే కదా?

## విద్యార్థుల కుటుంబానికి రూ. 5 లక్షలు.. ఒకరికి ఉద్యోగం ఇస్తాం

- మొదటి పేజీ తరువాయి

తల్లిదండ్రులను కలిశారు. విద్యార్థుల పేరెంట్స్ తో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి. చిన్నారుల మృతి బాధాకరమన్నారు. వారి తల్లిదండ్రులను ఆదుకుంటామని చెప్పారు. చనిపోయిన పిల్లల కుటుంబానికి ఐదు లక్షల చొప్పున పరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు భట్టి. ఇంకా భవిష్యత్తు ఉన్న ఇద్దరు బిడ్డలు చనిపోవడం బాధాకరం. ఆ తల్లిదండ్రుల బాధను తాము అర్థం చేసుకుంటున్నామన్నారు భట్టి. గత కొన్నేళ్లుగా పాఠశాలల పట్ల చూపిన నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమన్నారు భట్టి. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మిగిలిపోయిన పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కావలసిన నిధులు కేటాయిస్తామని చెప్పారు. ఈ పాఠశాలతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉన్న అన్ని పాఠశాలలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని చెప్పారు భట్టి. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ. 5000 కోట్లు పాఠశాలల అభివృద్ధి కోసం కేటాయించామన్నారు. విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రతి హాస్టల్లో పారామెడికల్ స్టాఫ్ ఉండేలా చూస్తాం.. విద్యార్థుల ఆరోగ్యం కోసం శ్రద్ధ వహిస్తామన్నారు. అత్యవసర మందులు కూడా పాఠశాల హాస్టల్ లో ఉండేలా చూస్తామన్నారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచుతామన్నారు భట్టి. పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఆహారంతో పాటు విద్యార్థులకు మౌలిక వసతులు, బెడ్ షీట్లు అందించాలని ఆదేశించారు. పాఠశాలల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. పాఠశాల ఆవరణలో ఔషధ మొక్కలు, పళ్ళ మొక్కలు పెంచుతామన్నారు. పాఠశాలలో ఏయే వసతులు కావాలో చెక్ లిస్టు తయారు చేయాలన్నారు. ఇక నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు నెలకు ఒక సారైనా విద్యార్థుల హాస్టళ్లను సందర్శించి వారితో కలిసి భోజనం చేయాలన్నారు భట్టి.

## మహిళల భద్రత కోసం 5 రోజులు స్పెషల్ డ్రైవ్

- మొదటి పేజీ తరువాయి

విద్యాసంస్థలు, ఇతర సంస్థల్లో అవేర్నెస్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దీనిపై మహిళా మంత్రులు, ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి కమిటీ వేస్తామని ప్రకటించారు. మహిళా సంఘాలతో కలిసి.. గ్రామస్థాయిలో సోషల్ యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బాధిత మహిళలకు ఈ యాక్షన్ కమిటీలు రక్షణ కవచంగా నిలుస్తాయన్నారు. మహిళలను వేధించకుండా పురుషులకు అవగాహన కల్పించాలన్నారు సీతక్క.

## బాలికల సంక్షేమ హాస్టల్ లో ఏసీబీ తనిఖీలు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ నిజామాబాద్ ఆగస్టు 13:** నిజామాబాద్ నగరంలోని కోట గల్లీలోని బాలికల (ఎస్సీ)సంక్షేమ హాస్టల్ లో మంగళవారం తెల్లవారుజామున ఏసీబీ అధికారులు దాడులు ఆకస్మికంగా చేశారు. ఎస్సి వసతి గృహం లో తప్పుడు బిల్లులతో అక్రమాలు జరుగు తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామున వసతి గృహంలో ఏసిబి అధికా రులు వివిధ శాఖల తో జాయింట్ ఆపరే షన్ చేపట్టింది. ఫుడ్ సేఫ్టీ అధికారి, శాని టరీ ఇన్స్పెక్టర్, తూనికల కొలతల అధికా రుల ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతు న్నాయి. వసతి గృహం లోని రికార్డులను పరిశీలిస్తున్నారు.

## క్యాబ్ డ్రైవర్ పై దాడి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ హనుమకొండ ఆగష్టు 13:** కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో తెల్లవారుజామున ఏడుగురు యువకులు వీరంగం సృష్టించారు. ట్యాక్సీ కార్ డ్రైవర్ తో గొడవ పడి కార్ల అద్దాలు పగలగొట్టారు.ఘటనలో రెండు కార్ల అద్దాలు ధ్వంసం అయ్యాయి. క్యాబ్ డ్రైవర్ కు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. బస్టాండ్ ప్రాంతంలో మూత్ర విసర్జన చేస్తుండటంతో వారిని క్యాబ్ డ్రైవర్ రాజు ప్రశ్నించారు. దాంతో ఆ యువకులు అతనిపై దాడికి దిగి అక్కడే ఉన్న కారు అద్దాలు ధ్వంసం చేసారు. బాధితుడు కాజీపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేసాడు. వీరంగం చేసిన యువకులలో సిద్దిపేట జిల్లాలోని రిజర్వ్ ఇన్స్పెక్టర్ పూర్ణచందర్ కొడుకు హర్ష వున్నాడు. తన తండ్రి సిద్దిపేటలో ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్నాడని... నన్ను ఎవరు ఏమి చేయలేరని కొడుకు వీరంగం సృష్టించారు. కాజీపేట పోలీస్ స్టేషన్ లోనూ కానిస్టేబుల్స్ తో వాగ్వాదానికి దిగాడు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ హన్మకొండ ఆగష్టు 13:** మంగళవారం నాడు హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యేరి క్యాంప్ కార్యాలయం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) 9 మంది లబ్ధిదారులకు సుమారు 4 లక్షల రూపాయల విలువ గల చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేసారు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ఆరోగ్య శ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు తగిన ఆర్థిక సాయం బాధితులకు అందిస్తోందని అన్నారు.ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు.


ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన – సారయ్య డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, సీనియర్ నాయకులు సౌరం అభిలాష్ , చిన్ని, పస్తం శంకర్, పత్రి రాజేష్, యూత్ నాయకులు సౌరం టోని, గంధం సారంగపాణి మరియు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి సహాయం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ కమాన్ పూర్, ఆగష్టు 13:** మృతురాలి కుటుంబాన్ని ముత్తారం మాజీ జడ్పిటిసి మైదం భారతి వరప్రసాద్ పరామర్శించి అ కుటుంబానికి బియ్యంతో పాటు నగదును అందజేశారు. రామగిరి మండలం ఆదివారం పేట గ్రామం లో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన మారం రాజమ్మ కుటుంబాన్ని పరామర్శించి మైదనీ భారతి వరప్రసాద్ వారి కుటుంబ సభ్యులకు.2000 రూపాయలు ల బియ్యం బ్యాగ్ అందజేశారు .ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మైదనీ బుచ్చయ్య రామగిరి మండలం యూత్ ఉపాధ్యక్షులు గోడిశేల సంతోష్ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నూరి శ్రీకాంత్ సీనియర్ నాయకులు కుర్రే కొమురయ్య మెండే ఓదెలు కొమ్ము బీరయ్య జక్కుల దనేష్ చిప్ప కుర్తి స్వామి దాసి పెళ్ళి రాజిరెడ్డి పాల్గొన్నారు..

# రాజ్యసభకు పెరుగుతున్న ఆశవహులు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ హైదరాబాద్, ఆగస్టు 13:** లంగాణలో రాజ్యసభ ఎన్నిక జరగనుంది. కాంగ్రెస్ పార్టీకి రాజ్యసభ స్థానం దక్కుతుంది. బలాబలాలను పరిశీలిస్తే కాంగ్రెస్ కే రాజ్యసభ పదవి దక్కుతుంది. కె.కేశవరావు బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరడంతో ఈ ఎన్నిక జరుగుతుంది. కేకే రాజ్యసభ పదవికి కూడా రాజీనామా చేశారు. దీంతో ఈ పోస్టుకు ఎన్నిక జరుగుతుంది. పదేళ్ల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశావహుల సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. రాజ్యసభ స్థానం దక్కించుకోవడానికి అనేక మంది పోటీ పడుతున్నారు. సీనియర్ నేతల నుంచి గత ఎన్నికల్లో టిక్కెట్ రాని వాళ్లంతా ఈ పోస్టుకోసం ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ లో సీనియర్ నేతలకు కొదవలేదు. పార్టీని నమ్ముకుని పదేళ్ల నుంచి ఉన్న వారు అనేక మంది ఉన్నారు. పార్టీ జెండాను వదలకుండా అధికారంలోకి వచ్చినా, రాకపోయినా పార్టీని బలోపేతం చేయడం కోసం చాలా మంది చాలా రకాలుగా ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు వాళ్లంతా పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు 2023 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలయిన నేతలు కూడా తమకు రాజ్యసభ స్థానం ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు. ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నారని తెలిసింది. తాము ఇన్నేళ్లు పడిన కష్టానికి తమకు ఒక అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. హైకమాండ్ ఇంకా దీనిపై వారికి ఎలాంటి హామీ ఇవ్వలేదు.. అయితే సీనియర్ నేత వి. హనుమంతరావు ఈ పోస్టుపై బాగా ఆశలు పెట్టుకున్నారు. అలాగే గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కని అద్దంకి దయాకర్ సయితం తనకు పదవి వస్తుందని ఆశతో ఉన్నారు. వీరితో పాటు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన మధుయాష్కీ వంటి వారు కూడా తమకున్న పలుకుబడితో ఢిల్లీలో పార్టీ పెద్దలను కలసి తమకు రాజ్యసభ స్థానం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు మరికొందరు సీనియర్ నేతలు కూడా ఇప్పటికే ఢిల్లీ బాట పట్టారు. కొందరు నేతలు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలసి తమ పేరును హైకమాండ్ కు పంపాలంటూ వినతులను అందచేస్తున్నారు.కానీ హైకమాండ్ ఆలోచన వేరే విధంగా ఉందన్న ప్రచారం జరుగుతుంది. సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ పేరును హైకమాండ్ పరిశీలిస్తున్నట్లు ఢిల్లీ లెవెల్లో ప్రచారం జరుగుతుంది. తెలంగాణ కాంగ్రెస్ నేతలు పోటీ పడుతుండటంతో మధ్యేమార్గంగా అభిషేక్ మను సింఘ్వీ కి ఆ స్థానం కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గతంలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాగా, అందులో ఒకటి రేణుకా చౌదరి, మరొకటి అనిల్ కుమార్ యాదవ్ కు ఇచ్చారు. ఇప్పుడు ఈ రాజ్యసభ స్థానాన్ని పార్టీ సీనియర్ నేతకు ఇవ్వాలన్న నిర్ణయానికి రావడంతో తెలంగాణ నేతల్లో ఆశలు వమ్ము అయ్యాయి. ఈ పోస్టు కూడా పోయినట్లేనా? అన్న నిరాశలో కొందరు నేతలున్నా

# కష్టపడ్డది కేసీఆర్.. క్రెడిట్ కాంగ్రెస్ ది.. హరీష్ రావు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ హైదరాబాద్ ఆగష్టు 13:** తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌పై సెటైరికల్ కామెంట్స్ చేశారు మాజీ మంత్రి హరీష్ రావు. సీతారామ ప్రాజెక్టును కేసీఆర్ నిర్మిస్తూ.

కాంగ్రెస్ క్రెడిట్ కొట్టేయాలని చూస్తోందన్నారు. రిబ్బన్ కటింగ్ అవకాశం వచ్చిందని ప్రాజెక్టును తామే కట్టినట్లు కలరింగ్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు.

కాగా, హరీష్ రావు తాజాగా మీడియాతో మాట్లాడుతూ. ఖమ్మంలోని సీతారామ ప్రాజెక్టు ప్రారంభం కోసం కాంగ్రెస్ నేతలు తెగ హడావుడి చేస్తున్నారు. రోజుకో మంత్రి వెళ్లి ప్రాజెక్టు సందర్శనలు చేస్తున్నారన్నారు.అసలు ఆ ప్రాజెక్టను నిర్మించింది కేసీఆర్. ఆయన నిర్మించిన ప్రాజెక్ట్‌కు కాంగ్రెస్ క్రెడిట్ కొట్టేయాలని చూస్తోంది. ప్రాజెక్ట్‌ను కాంగ్రెస్ పార్టీనే నిర్మించినట్టు ఫుల్ కలరింగ్ ఇస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో మేము చేసిన అభివృద్ధిని తాము చేసినట్టు చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది కాబట్టి..బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్ట్‌ను రేవంత్ రెడ్డి ప్రారంభించబోతున్నారు. ఆనాడు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ప్రాజెక్ట్‌ను కట్టింది కేసీఆర్ అని చెప్పారు. ఇప్పుడు మాత్రం కాంగ్రెస్ కట్టిందని చెబుతున్నారు.పబ్లిసిటీ కోసం మాత్రమే ఈ ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చండి అంటూ హితవు పలికారు.

# డ్రగ్స్ ఇవ్ టీజింగ్ పై గాయత్రి విద్యార్థులకు అవగాహన

**పెన్ పవర్ పెద్దపల్లి, ఆగష్టు 13:** జిల్లాలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో డ్రగ్స్ అండ్ ర్యాగింగ్, సైబర్ క్రైమ్ పై పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్ రావు, ఏఎస్ఐ రామస్వామి అవగాహన కల్పించారు. ఏ దేశానికైనా యువతే శక్తి, సమాజం దేశం అభివృద్ధిలో యువత శక్తి ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ లో గరిష్ట సంఖ్యలో యువత చేరడం చాలా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా దేశం యొక్క సవాలును స్వీకరిస్తూ ఈ రోజు మనం నషాముక్త్ భారత్ అభియాన్ క్రింద ఐక్యతగా ఉండి సమాజం, కుటుంబం, స్నేహితులు మాత్రమే కాకుండా మనం కూడా డ్రగ్స్ రహితంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా కంప్లైంట్ బాక్స్ ను ఏర్పాటు చేశామని, ఎవరైనా డ్రగ్స్, ర్యాంగింగ్, ఇవ్ టిజింగ్ కి పాల్పడినట్లయితే వారి పేరు అడ్రస్ తో పాటు ఫిర్యాదు బాక్స్ లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత అల్లెంకి




శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవీందర్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో హైడ్రా... పిడుగులు

**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, హైదరాబాద్, ఆగస్టు 13:** హైదరాబాద్‌లో వారం రోజులుగా అక్రమ నిర్మాణాలను విస్తృతంగా కూల్చివేస్తున్నారు. చెరువుల బఫర్ జోన్లలో నిర్మిస్తున్న వాటిని..నాలాలుకబ్జా చేసిన వాటిని కూల్చివేస్తున్నారు. గతంలో గ్రేటర్ హైదరాబాద్ అధికారులే ఆ పని చేసేవారు. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో హైడ్రా పేరుతో ప్రత్యేక వ్యవస్థను తీసుకు వచ్చారు. హైడ్రా అంటే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ . హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులు కబ్జా చేసి నిర్మాణాలను కూల్చి వేయడం.. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు దీన్ని ఏర్పాటు చేశారు. గత కొద్ది రోజులుగా ఆక్రమణలపై హైడ్రా అధికారులు విరుచుకుపడుతున్నారు. రాజేంద్రనగర్ పరిధి శివరాంపల్లిలో చెరువును ఆక్రమించిన ప్లాట్లు వేసి నిర్మాణాలు చేపట్టారు. వాటిని కూల్చి వేస్తున్నారు. గాజుల రామారం చింతలచెరువు బఫర్ జోన్‌లో 52అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ లేఅవుట్‌లోని పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలను సైతం హైడ్రా సిబ్బంది తొలగించారు. పార్కు స్థలంలో పాన్, కిరాణ దుకాణాలు, మరుగుదొడ్లు నిర్వహిస్తున్నారు. తాజాగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శివరాంపల్లి లో 18 ఎకరాల చెరువు లో కబ్జా కు గురైన 5 ఎకరాలలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చేశారు. మజ్లిస్ ఎమ్మెల్యే అడ్డుకున్నా వదిలి పెట్టలేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు అన్నీ



కలిపి 400కుపైగా ఉన్నాయి. నగరంలోని చెరువుల సంరక్షణను హైడ్రా ప్రధానంగా తీసుకుంటోంది. చాలా చెరువులు 60 శాతం, కొన్ని 80 శాతం ఆక్రమణలకు గురయ్యాయి. జీహెచ్‌ఎంసీ, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీల వరకు హైడ్రా పవర్ ఫుల్‌గా ఉంటుంది. భారీ హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగు నీటి పైపులైన్లు, విద్యుత్తు సరఫరా లైన్లు, డ్రైనేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణలోనూ ఈ విభాగం సేవలందిస్తుంది. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు కట్టాలంటే భయపడే స్థితికి తీసుకొస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇప్పటికే హెచ్చరించారు.

హైడ్రాకు ప్రభుత్వం పెద్దఎత్తున సిబ్బందిని సమకూర్చనుంది. ప్రత్యేక పోలీస్ స్టేషన్ కూడా ఉంటుంది. మొదటి దశలో ఆక్రమణలను అడ్డుకోవడం హైడ్రా చేసే అని వివరించారు. రెండో దశలో ఆక్రమించి నిర్మించిన భవనాలపై చర్యలు, అనుమతుల నిరాకరణ ఉంటుందని హైడ్రా కమిషనర్ ప్రకటించారు. ప్రభుత్వం స్థలాలు కబ్జాకు గురైనట్లు ఎవరి దృష్టికి వచ్చినా వెంటనే 18005990099, 040?29560509, 040?29560596, 040?29565758, 040?29560593నంబర్లకు కాల్ చేయవచ్చని హైడ్రా ప్రకటించింది. తనను వ్యక్తిగతంగా కూడా కలవవొచ్చని.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించారు.

# తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల లో అధికారుల సోదాలు..

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ హైదరాబాద్, ఆగస్టు 13:**తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ హాస్టళ్లలోఈరోజు ఏసీబీ దాడులు నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్‌లోని బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మంగళ వారం తెల్లవారుజాము నుంచి అధికారులు తనిఖీలు చేస్తున్నారు.హాస్టళ్లలో ఆహారం సహా సౌకర్యాలు తదితర విష యాలపై ఆకస్మిక సోదాలు చేస్తున్నారు.ఇక నిజామా బాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహంలో మంగళవారం తెల్లవారు జాము నుంచి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.వసతి గృహంలో విద్యా ర్థులకు అందుతున్న ప్రభుత్వ ప్రయోజనాల తీరును పరిశీలిస్తున్నారు. కొంత కాలంగా ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్న ఫిర్యాదుల మీద దాడులు చేస్తున్నట్లు



సమాచారం.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో కుల్లిన పదార్థా లతో ఆహారం వండుతున్నా రని ఆరోపణలు వస్తున్నా యి. అదేవిధంగా గతకొన్ని రోజులుగా వసతి గృహాల్లోని విద్యార్థులు తరచూ అనారో గ్యానికి గురవుతున్నారు.జగిత్యాల జిల్లా మెట్‌పల్లి లోని బాలుర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి తీవ్ర కడుపునొప్పితో చనిపోయి న విషయం కూడా తేలి సిందే. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ప్రభుత్వ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## ఆపరేషన్ గురుకులాలు.. కదిలిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇవాళ ఉదయం నుంచి గురుకుల పాఠశాలల్లో ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతల అధికారులు రెయిడ్స్ నిర్వహించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యతను పరిశీలించారు. ఇదే సమయంలో అటు మంత్రులు కూడా గురుకులాల బాట పట్టారు. జగిత్యాల జిల్లాపెద్దాపూర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తో కలిసి సందర్శించారు. ఇటీవల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. వారితో పాటు నలుగురు అస్వస్థతకు గురయ్యారు.
మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ములుగు గురుకుల పాఠశాల మూడో అంతస్తు పై నుంచి పడి నడుం విరగడంతో నిమ్స్ లో చికిత్స పొందుతున్న విద్యార్థి కార్తీక్ ను మంత్రి సీతక్క పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో అధికారుల తనిఖీలు జరిగాయి. ఈ సందర్బంగా ఎక్స్పైరీ అయిన ఆహారపదార్థాలను అధికారులు గుర్తించారు. అందుకే తరుచూ ఫుడ్ పాయిజన్స్ జరుగుతున్నాయని తెలిపారు. వీటితోపాటు బాత్రూంలు సరిగా లేకపోవడంతో అపరిశుభ్రత పెరిగి దోమలు విజృంభిస్తున్నాయని గుర్తించారు. వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

## పట్టాపాసు పుస్తకం ఇవ్వాలని ఎమ్మార్వో కాళ్లపై పడ్డ మహిళ




హైదరాబాద్ పెన్ పవర్:తన భూమికి పట్టా ఇవ్వాలని ఎమ్మార్వో కాళ్లపై పడింది ఓ మహిళ. తనకు పట్టా ఇప్పించాలని కన్నీళ్లుపెట్టుకుంది. ఈ ఘటన ఖమ్మం జిల్లా వేంసూరు తహశీల్దార్ కార్యాలయంలో జరిగింది. అమ్మపాలెం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ నాగమణి.. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఎకరం భూమిని పట్టాచేయాలని కోరింది.
ఎన్నో ఏండ్లుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కలేదు. MRO కాళ్లపై పడి కన్నీళ్లు పెట్టుకుంది. ఎకరం భూమిలో తాను సాగు చేసుకుంటున్నట్లు ఎమ్మార్వోకు చెప్పింది. పరిశీలించి న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

# యువత స్వయంకృషితో ఎదగాలి..ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్.

## శ్రావణి ఆటోమొబైల్ షాప్ ప్రారంభించిన..ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్.








**దంతాలపల్లి, పెన్ పవర్,ఆగస్టు 13:** యువత స్వయంకృషితో ఎదగాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. దంతాలపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ శ్రావణి ఆటోమొబైల్ షాప్ ను ప్రభుత్వ విప్, డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంకృషితో ఏర్పాటు చేసుకున్న ఆటోమొబైల్ షాపు నుంచి సురేష్ అభివృద్ధి చెందాలని కోరారు. ఆటోమొబైల్ యజమాని ఆవుల సురేష్ యాదవ్ దంపతులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్, సాయి రెడ్డి, సాధు లింగారెడ్డి శ్రీనివాసరెడ్డి, కొమ్మినేని సతీష్,దర్శనాల రవీందర్, మధుకర్ రెడ్డి,గిర్వాణి, శ్రీనివాస్ రెడ్డి, మల్లం శ్రీను, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐకమత్యంతో కాంగ్రెస్ పార్టీలో...కలుపుకొని పోవాలి



## కష్టపడి పనిచేసిన వారికే పదవులొస్తాయి

## డోర్నకల్ శాసనసభ్యులు రామచంద్రనాయక్

**దంతాలపల్లి పెన్ పవర్ ఆగస్టు13):** యూత్ కాంగ్రెస్ ఎన్నికల సమయత్తం కై సమావేశం ఏర్పాటు చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు సందర్భంగా పాల్గొన్న డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ కార్యకర్తల్లో కొత్తవారు, పాతవారిని భేదాలు లేకుండా సీనియర్లమనే తారతమ్యం లేకుండా ఐకమత్యంతో కాంగ్రెస్ పార్టీలో,కలుపుకొని పోవాలని,కలిసి పనిచేయకుండా విభేదాలు పెంచుకుంటే నష్టపోయేది కార్యకర్తలు, నాయకులేనని హెచ్చరించారు యూత్ కాంగ్రెస్ ఎన్నికల కోసం ఒక్కొక్కరు 100 సభ్యత్వాలను చేయాలని కోరారు గతం పార్టీలు జెండాలు మారాయి గాని వారు ఏజెండాలు ఒకటేనని అన్నారు సంపాదన కోసం, కాంట్రాక్టుల కోసం పనిచేశారని అన్నారు, నేను పదవిని కాంక్షించలేదని ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని, నన్ను నిజాయితీగా పనిచేయనెయ్యండని అన్నారు, సందర్భంగా కార్యకర్తలకు అధికారులను జరుగుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారూ దంతాలపల్లి మండలానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని దానికి శాసనసభ్యులు కృషి చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్ కోరారు గత పది సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్నామని నిజాయితీగా పనిచేసే మాకు అవకాశాలు కల్పించాలని కోరారు, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న మంచి కార్యక్రమాలను కార్యకర్తలు అంతా ప్రజల్లోకి తీసుకుపోవాలని కోరారు ఒక ఎమ్మెల్యేగా నేను ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మాత్రమే పనిచేస్తే సరిపోదని ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్లో సైనికుల పనిచేయాలని ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బట్టు నాయక్, ఉపాధ్యక్షులు సాదు సాయి రెడ్డి,బాలాజీ, గురుపాల్ రెడ్డి, కొమినేని సతీష్, ఆవుల సురేష్, కొమినేని రవీందర్ ,సంపేట రాము, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు,,తండా రాములు, చిల్ల సహదేవ్ , మల్లం శ్రీను,గుండగాని సైదులు, నవీన్ రెడ్డి,మోహన్,గిర్వాణి,రాజశేఖర్,సతీష్, దర్శనాల రవీందర్,యకన్న, సాదు ,లింగారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# సురక్షితమైన ఔషధాలకే ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్ గౌతమ్..

## జీనం వ్యాలీలో ఫార్మా కంపెనీలను సందర్శించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్..

## ప్రతికూల ప్రభావం చూపకుండా సురక్షితమైన ఔషధాలు తయారు చేయాలని సూచన..

## కెమో ఇండియా ఫార్ములేషన్, భారత్ బయోటెక్, బయోలాజికల్ లిమిటెడ్ సందర్శన..







**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 13:**
వ్యక్తిగత ఆరోగ్యం, పర్యావరణంపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపకుండా సురక్షితమైన ఔషధాలు తయారు చేయాలని ఫార్మా సంస్థలకు కలెక్టర్ గౌతమ్ సూచించారు.. మంగళవారం జీనం వ్యాలిలోని కెమో ఇండియా ఫార్ములేషన్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ బయోటెక్, బయోలాజికల్ ఇ లిమిటెడ్‌ను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు సందర్శించారు.. ప్రామాణిక ఆపరేటింగ్ విధానం ఔషధాల తయారీలో క్రమబద్ధమైన పద్దతిలో పరిశోధనలు చేస్తూ వాటి నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు..
ప్రపంచ స్థితిగతులకు అనుగుణంగా ఔషధాలు తయారి చేయడం, పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఔషధాలను ఉత్పత్తి చేయడంపై దృష్టి సారించాలన్నారు.. ప్రపంచ నిర్దిష్ట ప్రమాణాల నిబంధనల అనుగుణంగా ఔషధాలు తాయారు చేయలన్నారు. నూతన ఔషధాల ఆవిష్కరణ విధానంలో పరిశోధనలను మరింతగా అభివృద్ధి పరచాలని సూచించారు.. ఉత్పత్తి అయిన ఔషధాలను తరచుగా నాణ్యత పరమైన తనిఖీని (క్వాలిటీ కంట్రోల్ ) నిర్వహించాలన్నారు.
ఔషధాల తయారీలో బాగంగా డ్రగ్స్‌ను శుభ్రపరచడం, స్టెరిలైజేషన్, నాన్ స్టెరిలైజేషన్, కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.. ఔషధాలలో ఉత్పత్తి కోసం వివరణాత్మకమైన పరిశోధన మరియు అభివృద్ధికై చర్యలు చేపట్టాలని ఔషధాల నిల్వలు, రవాణా కోసం అంతర్జాతీయ ప్రమాణాల చర్యలు తీసుకోవడంకై నైపుణ్యాలను పెంపొందించడానికి ఉద్యోగులకు తరచుగా శిక్షణ ఇవ్వాలి. ఔషధాల నిల్వల కోసం నాణ్యత తగ్గట్టుగా భద్రతా చర్యలు, ఊహించని ప్రమాదాల సమయంలో ఉద్యోగుల పట్ల భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఔషధాల ఉత్పత్తిని పెంచి సామాన్య ప్రజలకు వ్యయబారం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమములో పాల్గొన్న అధికారులు ప్రశాంత్ కుమార్, జనరల్ మేనేజర్ డిఐసి, కె. చంద్ర శేఖర్ బాబు, డిప్యూటీ డైరెక్టర్, ఎం.వి.వెంకటశేఖర్, జి. సాయి కృష్ణ, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్‌లు, టిఎస్ఐఐసి అధికారులు: అనురాధ, జోనల్ మేనేజర్, డి వినయ్ కుమార్, ఐలా కమిషనర్ మరియు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.









